## ఆర్‌టిసి కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలి



ప్రజాపక్షం/నిజామాబాద్:ఆర్‌టిసి కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. బుధవారం జిల్లా టిజిఎస్ ఆర్‌టిసి రీజినల్ మేనేజర్‌గా ఊతనంగా విచ్చేసిన ఎస్‌జీవీకె మూర్తిని, డిప్యూటీ రిజినల్ మేనేజర్ జ్యోతిలను ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి సాయిలు, రాష్ట్ర నాయకులు వీడీ దాసు, సంజీవ్, నాయకులు మల్లయ్య, ఎంజె రెడ్డి పాల్గొన్నారు.

## టిజిఎండిసి చైర్మన్ అనిల్ పరామర్శ



ప్రజాపక్షం/భీమ్‌గల్ : దురదృష్టవశాత్తు కుంటలో పడి ముగ్గురు చిన్నారుల మృతి చెందిన విషాద ఘటనలో బాధిత కుటుంబాలను బుధవారం టిజిఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ పరామర్శించారు. విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబాలకు రూ.10 వేల ఆర్థిక సాయమందజేశారు. అనంతరం అనిల్ యువసేన సభ్యులతో కలిసి కుటుంబాలను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని నిత్యావసర సరుకులను అందజేసి మానవత్వాన్ని చాటుకుని మాట్లాడారు. ఈ విషాద ఘటన ప్రతిఒక్కరిని కలిచివేసిందని బాధిత కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీనిచ్చారు. ఈ కష్టకాలాన్ని కుటుంబ సభ్యులు ధైర్యంగా ఎదుర్కొని మనోధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ మృతి చెందిన చిన్నారుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకున్నారు.

## అక్రమాలను ఉపేక్షించేది లేదు




మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

ప్రజాపక్షం / చెన్నూరు:మున్సిపల్ పరిధిలో అక్రమాలకు తావివ్వబోమని, అక్రమాలకు పాల్పడే వారి పట్ల ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. 7వ వార్డు గెర్రె సమీపంలో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలపై బుధవారం ఆయన కొరడా ఝులిపించారు. ఓ అక్రమ కట్టడాన్ని జెసిబి ద్వారా కూల్చివేయడంతో పాటు మరికొందరికి హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూరు మున్సిపల్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అనుమతులు లేని అక్రమ కట్టడాలను తొలగిస్తామని, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అక్రమ వెంచర్లపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అక్రమాల కట్టడిలో ప్రజలు సైతం తమకు సహకరించాలని ఈ సందర్భంగా కమిషనర్ మురళీకృష్ణ కోరారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్



ప్రజాపక్షం/రామాయంపేట: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మెదక్ పట్టణానికి చెందిన కేంద్రె నిఖిల్, చింతకుంట ప్రేమ్‌కుమార్‌లు హోండా యాక్టివ్ ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు మండల పరిదిలోని అక్కన్నపేట రైల్వేగేటు సమీపంలో అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి 140గ్రాముల గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌ను స్వాదీనం చేసుకొన్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ నరేందర్ తెలిపారు. ఈదాడుల్లో మెదక్ డిటిఎఫ్ సిఐ గోపాల్, ఎస్‌ఐలు హరీష్, బాలయ్య, షరీఫ్‌లు ఉన్నారు.

## ఐఐటిలో సీటు సాధించిన విద్యార్థినిని సన్మానించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం / తానూర్: మండలం ఎల్వీ గ్రామానికి చెందిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యాతలం చిన్నారెడ్డి కుమార్తె యాతలం దీక్షిత రెడ్డి ఐఐటిలో సీటు సాధించారు ఈ సందర్భంగా బుదవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ విద్యార్థినిని అభినందించి, శాలువాతో సత్కరించారు. దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో మన ప్రాంత విద్యార్థులు ప్రవేశాలు పొందడం శుభపరిణామమని ఆయన అన్నారు. విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కష్టపడి చదవాలని సూచిచంచారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సోలంకి బీం రావు, వెంగల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ బుకింగ్ యాప్‌తో నిజామాబాద్‌లో

## అత్యధికంగా యూరియా విక్రయాలు : కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్:పారదర్శకంగా ఎరువుల పంపిణీ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌తో జిల్లా రైతులు రాష్ట్రంలోనే అత్యధికంగా యూరియా కొనుగోలు చేయటం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. జిల్లాలో పూర్తిగా ఆన్ లైన్ బుకింగ్ యాప్ ద్వారానే యూరియా విక్రయాలు జరుగుతున్నాయన్నారు. ఫలితంగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీ జరుగుతోందని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో పంటల సాగు కోసం 80857 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అవుతుందని అంచనా వేయగా జిల్లాకు 38766 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు వచ్చాయని వివరించారు. ఇందులో ఇప్పటివరకు రాష్ట్రంలోనే అత్యధిక పరిమాణంలో 21071 మెట్రిక్ టన్నుల యూరియాను రైతుల కొనుగోలు చేశారన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ యాప్‌తో 146393 మంది రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా కొనుగోలు చేయటం జరిగిందని వెల్లడించారు. గత సంవత్సరం ఇదే సమయానికి 13995 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే అమ్మకం జరిగిందని, ప్రస్తుతం 21071 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. రైతులు సమీప డీలర్ల వద్ద సొసైటీ సేల్ పాయింట్ల నుండి సాగు చేస్తున్న పంట విస్తీర్ణానికి అవసరమైన యూరియాను ముందుగా బుక్ చేసుకుని 24 గంటలలోగా బుకింగ్ ఐడి ఆధారంగా యూరియాను కొనుగోలు చేసుకుంటున్నారని కలెక్టర్ వివరించారు. ధృవీకరణతో పాటు భూమి యజమాని వివరాలు నమోదు చేసి కౌలు రైతులు కూడా యూరియా బుక్ చేసుకోవచ్చని సూచించారు. పట్టా పాస్‌బుక్ లేని రైతులు తమ ఆధీనంలోని సాగు భూమి వివరాలను మడల వ్యవసాయాధికారికి సమర్పించి యూరియా బుక్ చేసుకోవచ్చన్నారు. తొలి విడతగా యూరియా కొనుగోలు చేసిన రైతులు తిరిగి పక్షం రోజుల తర్వాత మళ్లీ బుక్ చేసుకునే వెసులుబాటు ఉందని సూచించారు. జిల్లాలో ఈ యాప్‌తో పక్కాగా పూర్తి పారదర్శకంగా యూరియా పంపిణీ జరుగుతుందని తెలిపారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్



ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెంచికల్‌పేట్, దహెగాం మండలాల రైతు వేదికల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దహెగాం మండలానికి చెందిన 83 మంది, పెంచికల్‌పేట్ మండలానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల వివాహాల సందర్భంగా ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో ఊరటనిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ రెడ్డి, దహెగాం తహసీల్దార్ షరీఫ్, సర్పంచులు భక్తు రామచందర్, చప్పిడి రవీందర్, పొట్టే ఉమామహేష్, అన్నం రుక్మాబాయి, అల్లూరి రాజేశ్వరి, షేక్ ఉస్మాన్, బొట్టుపల్లి కృష్ణవేణి, రాపర్తి జయలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉచిత విత్తనాలను రైతులు

## సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/ నేరడిగొండ: తెలంగాణ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉచిత కంది విత్తనాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. వ్యవసాయ శాఖ ఏవో కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రగతి సాధించాలని సూచించారు. వ్యవసాయమే మన జీవనాధారమని, సాగులో ఎలాంటి సందేహాలు, అవసరాలు ఉన్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి తగిన సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, పండరి, వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం



ప్రజాపక్షం/బోధన్:నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయంలో బోధన్ ఆర్‌డిఓవిజయ కుమారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులను పోలింగ్ కేంద్రాల వారిగా నియమించుట గురించి పార్టీ నాయకులతో చర్చించారు. ఎస్‌ఆర్‌ఐ 2026షెడ్యుల్ గురించి ఎన్యూమరేషన్ ఫారం ను నింపే విధానంలో లోటు పాట్లు, బూత్ లెవెల్ అధికారుల కార్యకలాపాలలో పాటించాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టియుసి పోరాటం

యూనియన్ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు




ప్రజాపక్షం / శ్రీరాంపూర్:సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎన్టియుసి యూనియన్ పోరాటాలను నిరంతరం కొనసాగిస్తుందని ఆ యూనియన్ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఆర్‌పీ1 గనిపై కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో టిబిజికెఎస్ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల సంఖ్య 65 వేల నుంచి 40 వేల వరకు తగ్గించబడిందని, కొత్త బొగ్గు గనుల ప్రారంభంలో విఫలమయ్యారని విమర్శించారు. సింగరేణి సంస్థ ఒకప్పుడు రూ.11,500 కోట్ల మిగులు నిధులు కలిగి ఉండగా, ప్రస్తుతం రూ.50 వేల కోట్లకు పైగా బకాయిల భారంలోకి వెళ్లిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎండిఆర్ చట్టం కారణంగా తెలంగాణకు చెందిన బొగ్గు బ్లాకులు సింగరేణికి దక్కకుండా పోయాయని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ నాయకత్వంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి జరుగుతోందని తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగాల వయోపరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచడం, ప్రమాద బీమాను రూ.1.50 కోట్లకు పెంచడం, సహజ మరణ బీమాను రూ.10 లక్షలకు వర్తింపజేయడం, పదవీ విరమణ పొందిన కార్మికులకు కూడా రూ.30 లక్షల ప్రమాద బీమా అమలు చేయడం వంటి నిర్ణయాలు కార్మిక కుటుంబాలకు భరోసా కల్పించాయని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి లాభాల్లో వాటా కల్పించిన ఘనత ఐఎన్టియుసికే దక్కుతుందని, వారికి మెరుగైన వేతనాలు, వైద్య, వసతి సదుపాయాల కోసం చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో కొత్త గనుల ఏర్పాటు, ఎక్స్‌టెన్షన్ గనుల పనులు ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మికుల అలవెన్సులపై ఆదాయపన్ను రీయింబర్స్‌మెంట్, మారు పేర్లు, కోర్టు కేసులు వంటి పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు సీహెచ్ భీమ్‌రావు, కలవేణి శ్యామ్, గరిగ స్వామి, పి. తిరుపతి రాజు, పేరం రమేష్, వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శి పి. శ్రీధర్, సెంట్రల్ నాయకులు రావుల అనిల్, బ్రాంచ్ నాయకులు ఎం. వెంకటేష్, ఎంబడి తిరుపతి, జొన్నల కుమార్, నరసింహస్వామి పాల్గొన్నారు.

## యూరియా యాప్‌కు వ్యతిరేకంగా ధర్నా



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి:మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం రైతులు యూరియా యాప్‌కు వ్యతిరేకంగా ధర్నా చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించటంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. యూరియా యాప్ వెంటనే రద్దు చేయాలని, గతంలో మాదిరిగానే సహకార సంఘాల ద్వారా నేరుగా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## 110 ఏళ్ల వృద్ధురాలు కరీంబీ కన్నుమూత

ప్రజాపక్షం / మందమర్రి:మందమర్రి పట్టణానికి చెందిన శతాధిక వృద్ధురాలు కరీంబీ (110) మంగళవారం రాత్రి వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో కన్నుమూశారు. గత వారం రోజులుగా ఆరోగ్యం క్షీణించడం, తీవ్రమైన ఎండల ప్రభావం కారణంగా ఆమె అస్వస్థతకు గురై మరణించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెగడపల్లి గ్రామంలో జన్మించిన కరీంబీ, హిమ్మత్‌నగర్‌కు చెందిన వజీర్ ను వివాహం చేసుకున్నారు. అనంతరం 1960 ప్రాంతంలో సింగరేణి ఉద్యోగావకాశాల కోసం కుటుంబంతో కలిసి మందమర్రికి వలస వచ్చారు. ఆమె భర్త వజీర్ కెకె5ఎ గనిలో టబ్ రిపేర్ మేస్త్రిగా పనిచేశారు. 1970లో ఆయన మరణించడంతో కుటుంబ బాధ్యతలను ఆమె భుజాన వేసుకున్నారు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న కరీంబీకి ఒకే కుమారుడు ఉండగా, కాలక్రమంలో కుమారుడు, కోడలు కూడా మరణించారు. భారత స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి తెలంగాణ ప్రాంతంలో జరిగిన సామాజిక, రాజకీయ పరిణామాలు, సింగరేణి కార్మిక ఉద్యమాలు, మందమర్రి పట్టణ అభివృద్ధిని ప్రత్యక్షంగా చూసిన అరుదైన తరానికి చెందిన వ్యక్తిగా కరీంబీ గుర్తింపు పొందారు.

## అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం: ఎమ్మెల్యే రామారావు



ప్రజాపక్షం / ముథోల్ :ముథోల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతననిస్తున్నామని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్పష్టం చేశారు. బుధవారం ముథోల్ మేజర్ గ్రామ పంచాయతీకి సంబందిచంని చెత్త సేకవరణకై వినియోగించబడే నూతన 2 వాహనాలను స్థానిక సర్పంచ్ షబానా బేగం ఇజాజుద్దీన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో దశలవారిగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతన్నామని, తెలిపారు. గ్రామాల అభివృద్ధి తోనే దేశ అభివృద్ధి సాధ్యమనే నినాదం లో భాగంగా గ్రామాల్లో నిర్వహించబడే ప్రతీ అభివృద్ధి కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ షబానా బేగం ఇజాజొద్దిన్ అభివృద్ధికి చూపుతున్న వైఖరినీ కొనియాడారు. ఇదే విధంగా రాబోయే రోజుల్లో సైతం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అదే విధంగా నూతనంగా నిర్మించుకోబడే ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులకు ప్రోసీడింగ్ కాపీలను అందజేశారు. వీటితో పాటు జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకంలో భాగంగా కోటి రూపాయల నిధులతో ముథోల్ నియోజకవర్గ కేంద్రంలో సిసి రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. అంతే కాకుండా తాగునీటి సదుపాయం కోసం నూతనంగా వేయబడ్డ బోర్‌వెల్‌ను సైతం ప్రారంభించారు. ప్రబుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని అర్హులైన ప్రతి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా గ్రామ సర్పంచ్‌లు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ షిందే ఆనంద్ రావు, పటేల్, ఎంపిడీఓ, లవకుమార్, స్థానిక పంచాయతీ సెక్రెటరీ అన్వర్ అలీ ఉప సర్పంచ్ కోరి లావణ్య సాయి, గ్రామ వార్డు సభ్యులు, స్థానిక బీజేపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ బడులలో చేర్పించాలి

ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్:భావితరాలకు బంగారు భవిష్యత్తు అందించాలనే సమున్నత ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రభుత్వ సంకల్పానికనుగుణంగా సర్కారు బడులలో నాణ్యమైన విద్యాబోధనను అందించటంతో పాటు మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చేందుకు చిత్తశుద్ధితో కృషి కొనసాగుతోందని తెలిపారు. మోపాల్ మండలం బోర్గాం(పి) జడ్పీహెచ్‌ఎస్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం సందర్శించారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతుండటాన్ని గమనించిన కలెక్టర్ వారితో భేటీ అయ్యారు. తమ పిల్లలను ప్రైవేట్ బడుల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు తెలుపటంతో కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల భారం ఎక్కువగా ఉండటమే కాకుండా ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యనందిస్తుండటంతో సర్కారు బడిలో తమ పిల్లలను చేర్పిస్తున్నామని తల్లితండ్రులు పేర్కొనగా ఈ విషయాలను వివరిస్తూ మిగతా వారిని కూడా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. నాణ్యమైన విద్యాబోధనతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కలిగిన ప్రభుత్వ బడులలో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు చొరవ చూపుతున్నారన్నారు. ఆయా తరగతులను సందర్శించి విద్యార్థుల బోధనా సామర్థ్యాన్ని పరిశీలించి బహుమతులు అందజేశారు. బాలబాలికలకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి అశోక్, మోపాల్ తహసీల్దార్ రేఖ, ఎంఈఓ సాయిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ తదితరులున్నారు.

### ప్రమాద రహిత సమాజం కోసం...

## ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని, భద్రతా నియమాల్ని పాటించడం వల్ల తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చునని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ అన్నారు. బుధవారం ఉదయం నిజామాబాద్ బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్తులకు మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదనే నిబంధనలు, మద్యంసేవించి వాహనాలు నడపడం వల్ల సంభవించే ప్రమాదాలు, చట్టపరమైన చర్యల గురించి వివరించారు. విద్యార్థులు చిన్న వయసులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు కూడా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్ నియమాల పట్ల ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గురుచరణ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు సర్వే నిర్వహణపై బిఎల్‌ఒలకు శిక్షణ

సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

ప్రజాపక్షం / పెంచికల్‌పేట్:ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)2026 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకు ఓటరు సర్వే నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తెలిపారు. ఈ సందర్భంగా బిఎల్‌ఓలు (బూత్ లెవల్ అధికారులు), బిఎల్‌ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు), బిఎల్‌ఓ సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఓటరు జాబితాల పరిశీలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాల పరిశీలనలో అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా పని చేయాలని సూచించారు. 2002 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి ఓటరు జాబితాలో నమోదు చేయాలని తెలిపారు. అలాగే ఓటు హక్కు ఎక్కడ నమోదై ఉందో నిర్ధారించి వివరాలను సేకరించాలని సూచించారు. సర్వేలో భాగంగా 2002, 2025 జాబితాలను పరిశీలించి కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పులు, చనిపోయిన ఓటర్ల పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటరు వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే సవరణ చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవీందర్, ఆర్ ఐ రాజేశ్వర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ ఓలు, బిఎల్‌ఏలు, బిఎల్‌ఓ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

